క్లుప్తంగా

21 నుంచి వేసవి వినోదం

కరప: స్థానిక భవన నిర్మాణ కార్మికుల సంఘం భవనంలో ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి వినోదం నిర్వహిస్తున్నట్టు ఆ శాఖ కాకినాడ జిల్లా కార్యదర్శి వి.శ్రీరామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పది రోజుల పాటు ఉచితంగా జరిగే ఈ కార్యక్రమంలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు పాల్గొనేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు వివిధ అంశాలపై మెళకువలు నేర్పుతామన్నారు. వేసవి వినోదంలో ఓరిగామి, డ్రాయింగ్, మట్టితో బొమ్మలు, పాటలు, కథలు, సైన్స్ ప్రయోగాలు, తెలుగు భాషాంశాలు, ఇంగ్లిషు లాంగ్వేజ్ స్కిల్స్, గణితంలో మెళకువలు వివరిస్తూ, శిక్షణ ఉంటుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి శ్రీరామారావు తెలిపారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు



మరిడమ్మ తల్లికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మరిడమ్మ అమ్మవారికి గురువారం మఖ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో వంకర తిరిగిన విద్యుత్ స్తంభం

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డులో విద్యుత్‌స్తంభం ప్రమాదభరితంగా ఉన్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. పెద్దాపురం నుంచి సామర్లకోట వచ్చే రోడ్డులో ఇనుప విద్యుత్తు స్తంభం సుమారు ఆరు నెలల ఉంచి వంకర తిరిగిపోయి, తుప్పు పట్టి ఎప్పుడైనా కూలిపోయే స్థితిలో ఉంది. ఇటీవల తుపాన్‌కు ఒరిగిపోయిందని, దానిని అధికారులు తాత్కలికంగా నిలిపి వదిలేశారు. స్తంభం కింది భాగంలో తుప్పు పట్టి రంధ్రం పడడంతో బలమైన గాలి వీస్తే పడిపోయేలా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే ఆ రోడ్డులో 11 కేవీ విద్యుత్ వైర్లు ఉన్న ఈ స్తంభం కూలితే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. ఆ స్తంభాన్ని మార్చి కొత్త స్తంభాన్ని వేయాలని కోరుతున్నారు. దీనిపై ట్రాన్సుకో ఈఈ ప్రభాకర్‌ను వివరణ కొరగా తమ సిబ్బందిని పంపి పరిశీలించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేవీ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కోర్సులలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు సత్యనారాయణ తెలిపారు.

చిత్రలేఖనంపై శిక్షణ

ఏలేశ్వరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. శిబిరాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు మామిడి రాము విద్యార్థులకు చిత్రలేఖనంపై మెళకువలు నేర్పారు. అలాగే మజ్జి నాగేశ్వరరావు గణితంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కోటనందూరు: విద్యార్థులను అన్ని రంగాల్లో ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ నాగరత్నం తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ నాగలక్ష్మి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు తప్పుదోవ పట్టకుండా వారి విజ్ఞానాన్ని పెంపొందించడమే వేసవి శిబిరాల లక్ష్యమన్నారు.

మూగజీవుల దాహార్తి తీరుద్దాం

- ఎండలకు అల్లాడుతున్న జీవాలు
- నీళ్లు అందుబాటులో ఉంచాలి
- ప్రస్తుతం వాతావరణం చల్లబడినా రానున్న కార్తెపైనే పాడిరైతు ఆందోళన



గ్రాసం కొరతతో రమణయ్యపేట ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్లాస్టిక్ కవర్లు తింటున్న గోమాత



కాకినాడ రూరల్ తమ్మవరంలో చెరువు నీటిలో గేదెను కడుగుతున్న రైతు



కాకినాడ రూరల్‌లో పశువుల కోసం ఏర్పాటు చేసిన నీళ్ల కుండీ

కాకినాడ రూరల్: వేసవి ఎండల తీవ్రత అంతకంతకూ పెరుగుతోంది. పగటి ఉష్ణోగ్రతలు సుమారు 39 డిగ్రీలు నమోదవుతుండడంతో ప్రాణికోటి, ముఖ్యంగా మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. ప్రస్తుతం అల్పపీడన ప్రభావంతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నప్పటికీ రానున్న రోహిణీకార్తెని తలచుకుని ప్రజలు భీతిల్లుతున్నారు. మన పరిస్థితే ఇలా ఉంటే మూగజీవాల పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో ఎక్కువ మంది పాడి రైతులు ఉన్నారు. వ్యవసాయంతో పాటు పాడి జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నారు. వీరికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పాడి పశువులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంది. ప్రస్తుతం పాడి పశువులు రూ.50 లక్షలు నుంచి లక్ష రూపాయల వరకు ధర పలుకున్నాయి. పశువులతో పాటు ఆవులు, గేదెలు, దూడలు, మేకలు, గొర్రెలు, కోళ్లను కాపాడుకోవల్సి ఉంది. గ్రామాల్లో ప్రస్తుతం నీటి ఎద్దడి తలెత్తకుండా చెరువులను పూర్తిగా నింపారు. వీటితో పాటు గ్రామ కూడళ్ల వద్ద నీటి కుండీలు ఏర్పాటు చేయడంతో పశువులకు నీటి సదుపాయం కల్పించినట్టు అయింది. రానున్న రోజుల్లో ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో గ్రాసం కొరతతో పాటు నీటి కొరత తలెత్తే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ మూగజీవాల పట్ల జాలిచూపాల్సి ఉంది. పశువులు, పక్షుల కోసం వీలును బట్టి నీటి సదుపాయం కల్పించగలిగితే వాటిని సంరక్షించినట్టు అవుతుంది. కాకినాడ పరిసరాలతో పాటు అర్బన్‌లో కొన్ని ప్రాంతాల్లో గోమాతలు రోడ్లపై సంచరిస్తూ ప్లాస్టిక్ కవర్లనే ఆహారంగా తింటున్నాయి. వాటికి ఆహారం తమ వంతుగా ప్రతి ఒక్కరూ సమకూర్చగలిగితే వడ దెబ్బ, తిండి కొరతతో అవి మృత్యువాత పడకుండా కాపాడుకున్నట్టు అవుతుంది.

మండలంలో పశుపక్ష్యాదుల వివరాలు ఇలా..

ఆవులు	2019
గేదెలు	7950
మేకలు	1480
గొర్రెలు	1570
కోళ్లు	14550

పాడి పశువులను రెండు పూటలా చల్లని నీటితో కడగాలి

వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున పశుపక్ష్యాదులను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉంది. ముఖ్యంగా పాడి గెదెలు, ఆవులను రెండు పూటలా చల్లని నీటితో కడగాలి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటే గోనె సంచులను తడిపి వాటిపై కప్పాలి. ఉదయం పూట దాణా తక్కువ గాను, సాయంత్రం ఎక్కువగా ఉంటేటట్టు చూసుకోవాలి. వడదెబ్బ తగలకుండా మధ్యాహ్నం పూట నీడ ఉండేలా జాగ్రత్తలు పాటించాలి.

– ఎం.రాజ్యలక్ష్మి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, వెటర్నరీ డిస్పెన్సరీ, పండూరు.

ముగిసిన లక్ష్య ఇంటర్నేషనల్ వేసవి శిబిరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా కలెక్టర్ నివాస్

బాలాజీచెరువు: ప్రతి ఏటా లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించే కిండర్ వండర్ సమ్మర్ క్యాంపు గురువారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ జె.నివాస్ హాజరై విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరకంగా దృఢంగా ఉండవచ్చన్నారు. పాఠశాల డైరక్టర్ సుగుణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సంగీతం, కుకింగ్, పిరమిడ్స్, శ్లోకాలు, స్విమింగ్, రైఫిల్ షూటింగ్, నృత్యం, కోడింగ్, స్టోరీ టెల్లింగ్, గుర్రపు స్వారీ వంటి విభాగాల్లో సమ్మర్ శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ వందన బోహ్రా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు 14 టేబుళ్లు

- ఆర్వో వెంకటరావు
- ఏర్పాట్ల పరిశీలన



కౌంటింగ్ సెంటర్ వద్ద ఏర్పాట్లను అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి పార్లమెంట్, అసెంబ్లీలకు 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేయనున్నట్లు రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. గురువారం సాయంత్రం జేఎన్టీయూకే సివిల్ బ్లాక్‌లో ప్రతిపాదించిన కౌంటింగ్ సెంటర్ వద్ద ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆర్వో పర్యవేక్షించారు. చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇచ్చారు. పార్లమెంట్, అసెంబ్లీలకు ఏర్పాటు చేయాల్సిన టేబుళ్లు, సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ నిర్వహణ సమయంలో ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్‌ఓ చల్లన్నదొర ఏఈ రమేష్ బాబు తదితరులు ఉన్నారు.

మళ్లీ అధికారం వైఎస్సార్ సీపీదే

- రెండోసారి ముఖ్యమంత్రి కానున్న జగన్
- కాకినాడలో 15 వేల మెజార్టీ తథ్యం
- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి



వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: వచ్చేనెల 4వ తేదీన వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ మరోసారి విజయ దుందుభి మోగించనుందని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ప్రజల ఆదరాభిమానాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ప్రమాణస్వీకారం చేస్తారని కేడర్ హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. స్థానిక డి కన్వెన్షన్‌లో గురువారం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ఇన్‌చార్జిలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో గడచిన నెల రోజులుగా అవిశ్రాంతంగా శ్రమించి పార్టీ విజయానికి పాటుపడ్డ ప్రతి ఒక్కరికి ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా తనకు అత్యంత సన్నిహితులైన మిత్రులు, బంధువులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించి ఆయా డివిజన్లలో పార్టీ విజయం కోసం తపనతో చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఓటమి భయంతో తెలుగుదేశం నేతలు పలుచోట్ల కవ్వింపు చర్యలకు పాల్పడినప్పటికీ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం కోల్పోకుండా పనిచేశారని ప్రశంసించారు. ఇతర జిల్లాల నుంచి అరాచక శక్తులను రప్పించి వైఎస్సార్ సీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి విధ్వంసం చేయడం ద్వారా పోలింగ్‌కు అవాంతరాలు కల్పించాలని టీడీపీ, జనసేన శతవిధాలుగా ప్రయత్నించిందని పేర్కొన్నారు. ఆ కూటమి నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు ప్రజలు కూడా వాస్తవాలను గ్రహించి పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఓటింగ్ సరళిని బట్టి 15 వేలకు పైగా మెజార్టీ వస్తుందన్న అంచనాతో ఉన్నామని ద్వారంపూడి ప్రకటించారు. అదే సమయంలో మెజార్టీ స్థానాల్లో విజయం సాధించడం ద్వారా జగన్ రెండోసారి సీఎం కానున్నారని కార్యకర్తలు హర్షధ్వానాలు, కేరింతలు మధ్య ప్రకటించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీని విజయపథాన నడిపించనున్నాయని పేర్కొన్నారు. కష్టించి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, రాష్ట్ర ప్రచారకమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, వివిధ డివిజన్ల మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

పారాలీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- గడువు వచ్చేనెల 25వ తేదీ
- మండల వాసులు మాత్రమే అర్హులు

కాకినాడ లీగల్: జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా న్యాయ సహాయం అందించడానికి మండల న్యాయసేవాధికార సంస్థలో పారాలీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి.కమలాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల న్యాయసేవాధికార సంస్థ పరిధిలో 25 మందిని ఎంపిక చేస్తామని, వారికి ఏడాది కాలం సేవలు అందించాలన్నారు. దరఖాస్తుదారు విద్యార్హత పదో తరగతి, దానితో సరి సమానమైన అర్హత ఉండాలి, వయో పరిమితి 18 ఏళ్లు నిండి ఉండాలి. మౌఖిక ఇంటర్వ్యూను ఎదుర్కొనవలసి ఉంటుంది.

అర్హత గల గ్రూపులు

విశ్రాంత టీచర్లు, విశ్రాం ప్రభుత్వ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, ఫిజీషియన్లు, న్యాయ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, సామాజిక సేవా సంస్థల్లో పనిచేస్తున్న ఎన్‌జీఓలు, పొరుగు మహిళ సంఘాల సభ్యులు, మైత్రి సంఘాల సభ్యులు, స్వయం సహాయక సేవా సంస్థల సభ్యులు, అట్టడుగున వున్న వారు వివిధ రకాల బాధితులు, గృహిణులు, సేవా దృక్పథం కలిగిన వ్యక్తులు, సంస్థచే గుర్తించబడిన ఇతరులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఖాళీల వివరాలు

మండల న్యాయసేవాధికార సంస్థలో 25 మందికి అవకాశం ఉంది. దరఖాస్తులు సమర్పించడానికి గడువు వచ్చేనెల 25వ తేదీ. సామాజిక చైతన్యం, సేవా తత్పరత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పనిచేసేవారు సమీపంలోని మండల న్యాయ సేవాధికార సంస్థలో లభించే దరఖాస్తులను పూర్తిచేసి గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి అందించాల్సి ఉంటుంది. అలాగే పదో తరగతి లేదా దానికి సమానమైన విద్యార్హత ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువీకరణ పత్రం, సామాజిక సేవా పనులకు సంబంధించిన పత్రాలను, ఒక పాస్‌పోర్టు ఫొటోపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది.

కాగా నిర్దేశిత దరఖాస్తును మాత్రమే అందజేయాలని సంస్థ చైర్మన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే గడువు ముగిసిన తరువాత ఏ కారణం చేత ఆలస్యమైనా లేదా అందజేసే దరఖాస్తులను స్వీకరించబోమని, దరఖాస్తుల స్వీకరణ, తిరస్కరణకు, నోటిఫికేషన్ రద్దు చేసేందుకు న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడికి పూర్తి అధికారం ఉంటుందని పేర్కొన్నారు.

చిరు జల్లులతో ఉపశమనం



వాకలపూడిలో గురువారం సాయంత్రం మేఘావృతమైన ఆకాశం

కాకినాడ రూరల్: వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగేలా వాతావరణం మారింది. ఉపరితల ఆవర్తనంతో గురువారం రోజంతా వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చిరుజల్లులు పడ్డాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు చల్లని వాతావరణంతో హాయిగా ఉండగా ఆకాశం మేఘావృతమై కనిపించింది. వేసవి ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్న తరుణంలో వాతావరణం చల్లబడడంతో వృద్ధులు, మహిళలు సేదతీరగా, చిన్నారులు సరదాగా గడిపారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత

- ఆర్వో వెంకటరావు



సీల్ వేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు



పిఠాపురం నియోజకవర్గం ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ: పోలింగ్ అనంతరం ఈవీఎం, వీవీ ప్యాట్‌లకు పటిష్ట భద్రత కల్పించినట్లు కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె. వెంకటరావు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం, వీవీ ప్యాట్ ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను గురువారం సందర్శించారు. ప్రతిరోజు రెండుసార్లు స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించాలన్న ఆదేశాల్లో భాగంగా అక్కడకు వెళ్లిన ఆయన విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్వో తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు తాళాలు వేసి సీల్ చేశామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత కొనసాగుతోందని స్పష్టం చేశారు. సెంట్రల్ పారా మిలటరీ బలగాలతో పాటు, రాష్ట్ర పోలీసులు కూడా నిరంతరం స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతను పర్యవేక్షిస్తారన్నారు. అలాగే నిరంతర పర్యవేక్షణకు ఇద్దరు గెజిటెడ్ అధికారులను కూడా నియమించినట్లు ఆర్వో తెలిపారు. ఈవీఎంల భద్రతపై ఎటువంటి అపోహలు అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

'పిఠాపురం' ఈవీఎంలకు పటిష్ట భద్రత

- స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతర నిఘా
- జేసీ రామసుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికలకు సంబంధించి పిఠాపురం నియోజకవర్గానికి చెందిన స్ట్రాంగ్ రూమ్‌ను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్, పిఠాపురం రిటర్నింగ్ అధికారి ఎస్ రామ్‌సుందర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన పిఠాపురం నియోజకవర్గం ఈవీఎంల స్ట్రాంగ్ రూమును, నిఘా వ్యవస్థను ఆయన పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో గత 13వ తేదీన పోలింగ్ ప్రక్రియ అంతా సజావుగా జరిగిందన్నారు. పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలను ఇక్కడ భద్రపచడం జరిగిందన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతరం పరిశీలించే విధంగా సీసీ కెమెరాలు అన్ని వైపులా కనిపించేలా ఏర్పాటు చేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర బలగాలతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు జేసీ తెలిపారు.

పదో తరగతి ఉత్తీర్ణులకు అభినందన



ఉత్తీర్ణులైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శేఖర్, సిబ్బంది

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల గ్రామం వద్ద గల కాకినాడ కేంద్రీయ విద్యాలయలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రిన్సిపాల్ బి.శేఖర్, సిబ్బంది గురువారం అభినందించారు. ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాలలో ఇక్కడి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 35 మంది పరీక్ష రాసి మొత్తం విజయం సాధించారు. పి.వర్షిత 500 మార్కులకు గాను 487 మార్కులు, కె.రూఫినా సాగర్ 475 మార్కులు, సాధించారు. తల్లిదండ్రులు సమక్షంలో ఆయా విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించి, భవిషత్‌లో ఉన్నత స్థితికి చేరుకునేలా ఉన్నత చదువులు కొనసాగించాలని కోరారు.

18న వాసవీ మాత ఆలయ వార్షికోత్సవం

తాళ్లరేవు: స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసియున్న వాసవీ మాత ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఈ నెల 18వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో 18వ తేదీ శనివారం ఉదయం అమ్మవారి గ్రామోత్సవం, మధ్యాహ్నం మహిళలచే సామూహిక పూజలు, సాయంత్రం ఊంజల్ సేవ ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకం

తాళ్లరేవు: స్థానిక భూసమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు బృందం స్వామివారిని పచ్చ కర్పూరంతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు, గోవింద మాలధారులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఏడు గంటలకు అర్చకులు ఉత్సవాల ఆరంభ స్నపనం (క్షీరాభిషేకం) నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తొలుత కలశాలతో ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహావచనం, అంకురార్పణ, వైనతేయ ప్రతిష్ఠ, పల్లకీ సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాత సంచుల వర్తక సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 వరకూ నిర్వహిస్తున్నారు.

నేడు ప్రత్యేక పూజలు

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ధ్వజారోహణ, గరుడ ప్రసాద వితరణ, యాగశాల ప్రవేశం, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, భేరిపూజ, దేవతాహ్వానం, వాహనసేవ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.